కథ



“ఏమిటో ఈ దారుణం? ఈమధ్య ఎక్కడ చూసినా మతకలహాలు, మారణహోమాలు! ఎప్పుడు ఏ చిన్న అవకాశం వచ్చినా ఈ వీధిగూండాలు, రౌడీలు తమకు అనుకూలంగా ఉపయోగించుకొని తమ అల్లర్లు కొనసాగిస్తున్నారు. ఈ అల్లర్లు శరవేగంగా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి, ఒక ఊరి నుండి మరో ఊరికి పాకుతూ సామాజిక పరిస్థితిని కలుషితం చేస్తున్నాయి. దీనికి పరిష్కారం ఏమిటో? ఈ మతకలహాలు, మారణ హోమాలు యిలా సాగవలసిందేనా?” నిట్టూరుస్తూ అన్నాడు రామారావు.

“అవును. ఇప్పుడు ఎవరికీ మతసహనం ఉండటం లేదు. పైగా మతాన్ని రాజకీయ లబ్ధికోసం కొందరు స్వార్థపరులు వాడుకోవటంతో నానాటికీ పరిస్థితి దిగజారుతోంది” అన్నాడు కృష్ణమూర్తి వంతపాడుతూ.

# సంప్రదాయం

“అవును భాయ్! ఏ మతం కూడా హింసగానీ, మారణహోమంగానీ ప్రోత్సహించలేదు. ఏ మతమైనా మంచినే బోధిస్తూంది” అన్నాడు రహీం.

“అవును. ప్రతీ ఏడూ చాలామంది ఈ మతమహమ్మారి బారిన పడి బలవుతున్నారు. ప్రస్తుతం పక్కనున్న పట్నంలో కూడా ఈసారి మళ్లీ మతకలహాలు చెలరేగి, దానివలన, ఆ తర్వాత జరిగిన పోలీసుల లాఠీ చార్జీ, కాల్పులతో చాలామంది గాయపడ్డారు. మెల్లగా ఈ అల్లర్లు చుట్టుపక్కల ప్రాంతాలకి పాకాయి అప్పుడే. మన పక్క ఊళ్లకి, ముఖ్యంగా మన ఊరికి యివి రాకుండా చూడాల్సిన బాధ్యత ఉంది మనకి” అన్నాడు ముస్తాఫా.

“ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రయత్నించాలి మనం” అన్నాడు కృష్ణమూర్తి.

“అవును. మనం కలిసికట్టుగా ఆలోచించి యిటువంటివి యిక్కడ మొలకెత్తకుండా చూడాలి. ఒకసారి విషబీజం నాటిందంటే చాలా వేగంగా పెరిగిపోతుంది మరి. మన వాళ్లందరూ బాధ్యత నెరిగి పరస్పర సోదర భావంతో మెలిగి కలిసికట్టుగా ఉండేందుకు ఏమైనా ఆలోచించాలి. కనీసం మన ఊరికిగానీ, యీ చుట్టుపక్కలకు గానీ ఈ మహమ్మారి వ్యాపించకుండా తగిన జాగ్రత్త వహించాలి” అన్నాడు రామారావు.

రామారావు, కృష్ణమూర్తి, రహీం, ముస్తాఫా... ఈ నలుగురు యువకులూ మంచి స్నేహితులు. వాళ్లు నలుగురూ ప్రైమరీ స్కూల్ నుండి కలిసి చదువుకున్నారు. దగ్గర ఉన్న పట్నంలో కాలేజీ చదువు పూర్తి చేసి


**డి. వి. డి. ప్రసాద్**

ఈమధ్యనే ఉద్యోగం వేటలో పడ్డారు. వాళ్లు ఎంత మంచి స్నేహితులంటే తెలీని వాళ్లు వాళ్లని అన్నదమ్ములని భావిస్తారు. అయితే తమ చుట్టుపక్కల సాగుతున్న మతకలహాలు, మారణహోమాలు వారి మనసుల్ని కలతపర్చాయి. వార్తల్లో, పేపర్లలో చూసిన వారికి అంతులేని మనస్తాపానికి గురిచేసాయి. ఒకరికి ఒకరు ప్రాణం పెట్టే ఆ నలుగురూ, కలిసికట్టుగా ఈ ఉపద్రవాన్ని ఎదుర్కోవడానికి సంకల్పించారు.

“ఆ.. అయిడియా!” అన్నాడు రామారావు ఆలోచనల్లోంచి తేరుకొని కొద్దిసేపటికి.

ఏమిటన్నట్లు ఆతృతగా చూసారు మిగిలిన ముగ్గురు.

“మన మధ్యగల అనైక్యత వల్లనే గదా, ఈ మత కలహాలన్నీ సాగుతున్నాయి. మనమందరమూ కలిసికట్టుగా ఉంటే ఎలాంటి స్వార్థపరులైనా, దుండగులైనా ఏమి చేయగలరు? మనలో ఐకమత్యం లోపం వల్లే అపార్థాలు ఏర్పడుతున్నాయి కదా! ముఖ్యంగా మన పండుగ రోజుల్లో, పవిత్ర దినాల్లో యిలాంటివి సాధారణంగా జరుగుతుంటాయి. పండుగలు, ఉత్సవాల




సందర్భంగానే అరాచక శక్తులు తలెత్తుతుంటాయి.

మన పండుగల్లో రకరకాల సంప్రదాయాలున్నాయి. కొన్ని కొన్ని మధ్యలో వచ్చి చేరినవే! అలాగే మనమే ఓ కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుడదాం. మన పండుగలకి కావలసిన పూజాసామగ్రి, యితర వస్తువులు రహీం, ముస్తాఫా అందించిన తర్వాతే మన పండుగ ఆరంభించాలి. అలాగే వారి ఉత్సవాల్లో మనం కూడా పాలు పంచుకోవాలి. వారికి కావలసినవి మనం అందించాలి. వారి విందుల్లో మనం పాల్గొనాలి. కొన్నాళ్లకి యిదో సంప్రదాయంగా మారడం ఖాయం. వాళ్ల వద్దనుండి పూజా ద్రవ్యాలు అందిన తర్వాతే మనం పండుగ ప్రారంభించడం ఓ విధిగా మారుతుంది. ఇలాంటి సంప్రదాయమే మత సామరస్యానికి పునాది అవుతుంది. అప్పుడిక మత కలహాలకి తావే ఉండదు. మనని చూసి మన చుట్టుపక్కలనున్న ఊళ్లలో కూడా యీ సంప్రదాయం మొదలవుతుంది. ఈ విధంగా సమస్య శాశ్వతంగా పరిష్కారమై మనుషుల్లో ఐకమత్యం పెరగవచ్చు. ఎలా ఉంది నా ఆలోచన! అయితే యిది పూర్తి ఫలితాన్ని యివ్వడానికి కొన్నేళ్లు పట్టవచ్చు. ఈలోగా మనం పరిస్థితిని సమర్ధవంతంగా ఎదుర్కొని నిలబడటానికి ప్రయత్నించాలి మరి'' అంటూ రామారావు మిత్రుల వైపు చూసాడు.

అంతవరకూ ఆసక్తిగా అతని మాటలు వింటున్న మిగతా ముగ్గురూ వెంటనే స్పందించారు.

''రామారావు భాయ్! నువ్వు చెప్పింది చాలా బాగుంది. అలాగే చేద్దాం. ఈ సంక్రాంతి నుండి ఇది మనం అమలు చేద్దాం'' అన్నాడు రహీం సంతోషంగా.

అలాగేనన్నారు మిగతా యిద్దరూ. ఆ విధంగా వారి ఆలోచనలు అమలుచేసారు.

ఇది జరిగిన ఓ ముప్ఫై ఏళ్ల తర్వాత...

ఆ నలుగురు మిత్రులూ యిప్పుడు ఉద్యోగాలు చేసి రిటైరయ్యారు. తరచూ సాయంకాలంలో పార్కులో కలిసి పాత సంగతులు నెమరువేసుకుంటారు.

ముప్ఫై ఏళ్ల క్రిందట వాళ్లు ప్రారంభించిన సంప్రదాయం నేటికీ అమలవుతోంది. వీరిని ఆదర్శంగా తీసుకొని చుట్టుపక్కల కొన్ని గ్రామాల్లో, పట్టణాల్లో యిదే విధంగా సంప్రదాయం కొనసాగుతోంది.

తరచూ సాయంకాలం పార్కులో కలుసుకునే వాళ్ల స్నేహ బంధం ఇన్నేళ్లయినా ఏమాత్రం చెక్కు చెదరలేదు. పైగా గట్టి పడింది కూడా. వాళ్లు ప్రారంభించిన సంప్రదాయం నిరాటకంగా సాగిపోవడం ఆ నలుగురు మిత్రులకి చాలా తృప్తినిచ్చింది.

''ప్రతీ ఊరిలోనూ, యిలాగే జరిగితే మన దేశంలో సామరస్యానికి కొదవ ఉండదు. ఐకమత్యానికి ఢోకా ఉండదు కదా!'' గతం నెమరువేసుకుంటూ అన్నాడు రామారావు ఆరోజు మిత్రులతో.

''అవును భాయ్! మన వల్ల స్ఫూర్తిపొందిన వాళ్లు ఎందరో ఉన్నారు. తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగాలని నా ఆకాంక్ష'' అన్నాడు రహీం.

''అవును'' వంత పాడారు మిగతా మిత్రులు.

(ఒరిస్సాలోని సంబల్‌పూర్‌లో నేటికీ ఒకరి ఉత్సవాల్లో మరొకరు పాల్గొనే సంప్రదాయం అమలులో ఉంది. హిందూ పండుగలలో ముస్లిం సోదరులు, ముస్లిం ఉత్సవాల్లో హిందూ సోదరులు పాల్గొనడం అక్కడ ఆచారంగా మారింది. ఆ ప్రేరణే ఈ కథకి మూలం)

## టకియాకి టకటకా చాన్స్‌లు!

**బాలీవుడ్‌లో ఇప్పుడు తాజాగా టాప్ హీరోలు సైతం క్రేజ్ ప్రదర్శిస్తున్న హీరోయిను ఎవరయ్యా అంటే- ఆయేషా టకియా అంటున్నారు. ఇట్టే ఆకట్టుకునే అందాలతో జనాన్ని వెర్రెక్కించేలా కనిపించే ఆయేషాని తమ చిత్రాల్లో బుక్ చేయమని సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్, సంజయ్ దత్ లాంటి టాప్ హీరోలు సైతం తమ నిర్మాతలకి సజెస్ట్ చేస్తున్నారట. ఇలా ఆయేషా టకియా టకటకామని చాన్స్‌లు కొట్టేస్తోందిట.**